క్లుప్తంగా

కవి వెంకటేశ్వర్లుకు పురస్కారం



బైనా వెంకటేశ్వర్లుకు సత్కారం

ముత్తుకూరు: ముత్తుకూరు పంచాయతీ బలిజ పాళేనికి చెందిన కవి బైనా వెంకటేశ్వర్లు విజయవాడలోని శ్రీకొత పూర్ణానంద విలాస్ కళావేదికలో గురువారం తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. తెలుగు భాష పరిరక్షణకు కృషి చేస్తున్న వివిధ సంస్థలు ఆయనకు ఈ పురస్కారాన్ని ఇచ్చాయి.

నేతాజీకి ఘన నివాళి



విడవలూరు: స్థానిక పీఆర్ఆర్– వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ ఈశ్వరరావు, ఇతర అధ్యాపక సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటర్లు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు



పొదలకూరు: మండలంలోని రాపూరు మార్గం దుగ్గుంటకు సమీపంలో గురువారం కారు చెట్టును ఢీకొట్టింది. స్థానికుల కథనం మేరకు.. కారు రాపూరు నుంచి నెల్లూరుకు వెళ్తోంది. దానిని డ్రైవర్ శీను వేగంగా నడుపుతుండగా అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.

లేఅవుట్ సందర్శన



బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీ లేఅవుట్‌ను చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం సందర్శించారు. అక్కడ రోడ్లు, డ్రెయిన్ల పరిస్థితిపై ఆరాతీశారు. త్వరలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపడతామని తెలిపారు.

ఇన్‌చార్జి వీసీని కలిసిన ఏపీటీఏ ఆర్డీ



వెంకటాచలం: ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ (ఏపీటీఏ) రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రమణ ప్రసాద్ విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావును గురువారం వర్సిటీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాల గురించి వారు చర్చించారు.


ఆర్థిక పరిస్థితిపై సర్వే



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కోవూరు: మండల పరిధిలోని పడుగుపాడు గ్రామంలో ప్రజల ఆర్థిక పరిస్థితిపై జరుగుతున్న సర్వేను ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యుత్ శాఖకు సంబంధించి కమర్షియల్ కనెక్షన్ తీసుకున్న వారి వివరాలు నమోదు చేయాలన్నారు.

కోవూరులో జాబ్‌మేళా



కోవూరు: కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళాను నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో దాదాపు ఆరు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేశారు. మొత్తం 41 మంది హాజరు కాగా 19 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. డీఎస్‌డీఓ అబ్దుల్ ఖయ్యూం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీప్రసూన పాల్గొన్నారు.

రొయ్య రైతు విలవిల

- వెనామీని చుట్టుముడుతున్న సీజనల్ వ్యాధులు
- అధిక మంచుతో మరింత అనర్థాలు
- ఎన్ని మందులు వాడినా ఫలితం శూన్యం

మండలంలో..

ఆక్వా సాగు : సుమారు 5 వేల ఎకరాల్లో..



కోడూరులో వెనామీ రొయ్యల గుంత

తోటపల్లిగూడూరు: వాతావరణ మార్పుల కారణంగా వెనామీని వ్యాధులు చుట్టుముట్టాయి. అనేక రకాల మందులు వాడినా ఫలితం లేకపోవడంతో ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తీర ప్రాంతం గ్రామాలైనా కోడూరు, వెంకన్నపాళెం, ఈదూరు, సౌత్‌ఆములూరు, విలుకానుపల్లి, మండపం, వరకవిపూడి, మల్లికార్జునపురం, కొత్తపాళెం, పోట్లపూడి గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో ఆక్వా సాగులో ఉంది. గతంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నా ఆక్వా సాగు ఐదేళ్ల నుంచి రైతులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతోపాటు అంతుచిక్కని వైరస్‌ల కారణంగా వెనామీ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది.

దీని వల్లే..

వాతావరణంలో చోటుచేసుకుంటున్న పెను మార్పులకు తోడు సీజనల్ వ్యాధులు వెనామీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రస్తుతం వైట్‌స్పాట్‌తో పాటు విబ్రియో, హార్డ్ సెల్ వ్యాధులు అతలాకుతలం చేస్తున్నాయి. వీటి వల్ల చెరువుల్లోని రొయ్యలు కుప్పలుతెప్పలుగా మృత్యువాతపడుతున్నాయి. పగలు అధిక ఉష్ణోగ్రతలు, రాత్రి విపరీతంగా మంచు కురుస్తుండటంతో ఈ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతోనే వెనామీని పలురకాల వ్యాధులు చుట్టుముట్టాయని సంబంధిత అధికారులు, మత్స్యశాఖ నిపుణులు సేర్కొంటున్నారు. వ్యాధుల నివారణకు ఎన్ని రకాల మందుల వాడినా ఫలితం లేకుండా పోతోందని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైట్ స్పాట్ అధికంగా ఉంది



వెనామీకి వ్యాధుల బెడద అధికంగానే ఉంది. ముఖ్యంగా వైట్ స్పాట్ అధికంగా ఉంది. అలాగే మిగిలిన వ్యాధులకు వేల రూపాయలు ఖర్చు పెట్టి మందులను వినియోగిస్తున్నా ఫలితం ఉండటం లేదు. దీంతో రొయ్య పిల్లలు చిన్న వయసులోనే మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికే అంతంతమాత్రంగా ఉన్న వెనామీ సాగు ఈ వ్యాధులు బెడదతో కోలుకోలేని పరిస్థితి నెలకొంటోంది.

– ఊటుకూరు శ్రీనివాసులు, ఆక్వా రైతు, కోడూరు

అప్రమత్తత అవసరం

సీజనల్ వ్యాధులైన వైట్ స్పాట్, విబ్రియో, హార్డ్ సెల్ తదితరాలు ప్రస్తుతం ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ చలికాలంలో అధికంగా మంచు కురవడం కారణంగా ఆక్సిజన్ తక్కువై వైట్ స్పాట్ సోకుతుంది. దీని నివారణకు ఎలాంటి మందులు పనిచేయడం లేదు. వీలైనంత వరకు ఆక్సిజన్ పెంచేందుకు ఏరియేటర్లను అధికంగా వినియోగిస్తే కొంత ఫలితం ఉంటుంది. విబ్రియో వ్యాధి సోకితే రొయ్య ఎర్రగా మారి గుంటలోపే చనిపోతుంది. హార్డ్ సెల్ వ్యాధి సోకితే రొయ్యలు సెల్ విడవడం జరగదు. అదే జరిగితే అవి చిన్న వయసులోనే గిటకబారి చనిపోతాయి. ఈ వ్యాధి సోకిన వెంటనే మినరల్స్‌ను అధికంగా వినియోగిస్తే కొంత ఫలితం ఉంటుంది.

– వెంకటేశ్వర్లు, ఆక్వా టెక్నీషియన్, కోడూరు



వ్యాధులతో మృత్యువాత పడిన రొయ్యలు



వ్యాధుల భయంతో విక్రయించేందుకు సిద్ధం చేసిన రొయ్యలు

హుండీ కానుకల లెక్కింపు

పొదలకూరు: పట్టణంలోని పోలేరమ్మ తల్లి ఆలయ హుండీలోని కానుకలను దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో గురువారం లెక్కించారు. రూ.30,223 వచ్చినట్టు వెల్లడించారు. ఈ లెక్కింపులో భక్తులు పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

మనుబోలు: రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య సూచించారు. మండలంలోని పిడూరు గ్రామంలో గురువారం సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ బషీర్, మండల సర్వేయర్ శ్రీనివాసులు, ఆర్ఐ నారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

పొదలకూరు: పట్టణంలోని ఎమ్మార్వో, నర్సారెడ్డి కాలనీల్లో గురువారం పంచాయతీ, ఆరోగ్య శాఖ సిబ్బంది సంయుక్తంగా మురుగు కాలువల్లో అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు వైద్యాధికారి రిషిత కిరణ్ పర్యవేక్షణలో కాలనీల్లో లార్వా అధికంగా ఉన్న ప్రాంతాల్లో పిచికారీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రజలు ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. ఇంట్లో మంచినీటి తొట్టెలను శుభ్రం చేసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆంజనేయవర్మ, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, ఆరోగ్య సహాయకులు రాధాకుమారి, శివప్రసాద్, సుమామంజలి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రసన్నను కలిసిన నాయకులు



ప్రసన్నకు పూలమొక్కను అందజేస్తున్న లింగారెడ్డి

ఇందుకూరుపేట: మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిని, ఆయన తనయుడు రజత్‌కుమార్ రెడ్డిని మండలంలోని మైపాడు గ్రామానికి చెందిన గజ్జిల లింగారెడ్డితోపాటు నాయకులు, కార్యకర్తలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసి పూలమొక్కను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఏల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బుచ్చిలో న్యాయ విజ్ఞాన సదస్సు



పిల్లలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రగతి చారిటబుల్ ట్రస్టులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక పిల్లల ఆరోగ్య పరిస్థితి, వసతి గృహం, భోజన వసతులను పరిశీలించారు. అలాగే వీరికి వైద్య సదుపాయం ఏ విధంగా అందుతుందని అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ సురేంద్ర, హోమ్ మేనేజ్‌మెంట్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కరకట్ట నిర్మాణానికి చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఈ దేశ్‌నాయక్

ఇందుకూరుపేట: పల్లిపాడు పరిధిలో పెన్నా పరీవాహక పరిధిలో కరకట్ట నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఇరిగేషన్ శాఖ ఎస్ఈ దేశ్‌నాయక్ తెలిపారు. మండలంలోని పల్లిపాడులో పెన్నానదిని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2021లో వచ్చిన విపత్తు సమయంలో గాంధీ ఆశ్రమం, పరిసర ప్రాంత గ్రామాలు వరదలకు గురైనట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో వాటి రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై పరిశీలించామన్నారు. వీటికి బలమైన కరకట్టలు ఏర్పాటు చేయాలా? లేదా రక్షణ గోడలు నిర్మించాలా? అనే అంశంపై ఆలోచిస్తున్నామన్నారు. బలమైన కరకట్టలు ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఆయన వెంట గాంధీ ఆశ్రమ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.

నిర్మాణాన్ని నిలిపివేయాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని ఇరిగేషన్ స్థలంలో చర్చి నిర్మాణాన్ని నిలిపి వేయాలంటూ విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులతో పాటు స్థానిక ప్రజలు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. తొలుత తహసీల్దార్‌కు అనంతరం కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. కొన్ని తరాలుగా తాము రిజర్వాయర్ ఒడ్డున కర్మకాండలు చేసుకునే స్థలాన్ని కూడా ఆక్రమించారంటూ స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి



ఇందుకూరుపే : పాడి రైతులకు సూచనలిస్తున్న ఏడీ మురళీకృష్ణ



కోవూరు: గంగవరంలో..

ఇందుకూరుపేట: పశు వైద్యశిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థశాఖ ఏడీ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని గంగపట్నం, నిడిముసలి, పాములవారిపాళెం, డేవిస్‌పేట గ్రామాల్లో ఉచిత పశు వైద్యశిబిరాలను గురువారం నిర్వహించారు. డేవిస్‌పేట, పాములవారిపాళెం గ్రామాల్లో జరిగిన శిబిరాల్లో ఆయన పాల్గొని, పాడి రైతులకు సూచనలు, సలహాలు అందించారు. వైద్యాధికారులు పశువులను పరిశీలించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. వైద్యాధికారులు డాక్టర్ అస్లామ్ అత్తర్, డాక్టర్ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

➡ **కోవూరు:** మండలంలోని గంగవరం గిరిజన కాలనీలో పశు వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. పశువైద్యురాలు ప్రీతి సాల్మన్ ఆధ్వర్యంలో 97 గొర్రెలకు టీకాలు, వంద కోళ్లకు తెగులు రాకుండా టీకాలు వేశారు. అలాగే 35 దూడలకు నులి పురుగుల మందు తాపించారు.

కాకాణి నివాళి



నివాళులర్పిస్తున్న కాకాణి

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలుకు చెందిన మారంరెడ్డి సాయిమోహన్‌రెడ్డి (32) అనే వ్యక్తి హఠాన్మరణం చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం గ్రామానికి వెళ్లి సాయిమోహన్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పనిచేసే కార్యకర్తను కోల్పోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అతడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, పార్థేశ్వరరెడ్డి, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్ రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, కంచి మణి, దువ్వూరు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌రెడ్డికి అభినందన

బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్‌సీపీ బుచ్చి రూరల్ అధ్యక్షుడిగా ఎన్నికైన చెర్లో సతీష్‌రెడ్డిని జొన్నవాడ సెంటర్‌కు చెందిన రసూల్ ఆధ్వర్యంలో యువకులు గురువారం ఆయన నివాసం వద్ద కలిశారు. ఈ మేరకు అభినందనలు తెలిపి సన్మానించారు.

లెప్రసీ సర్వే పరిశీలన



కోవూరు: మండలంలోని పడుగుపాడులో జరుగుతున్న లెప్రసీ సర్వేను అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ గురువారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సర్వే జరుగుతున్న తీరుపై ఆరాతీశారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్, ఆశా వలంటీర్లు స్వర్ణమ్మ, హైమావతి పాల్గొన్నారు.

డీఎస్ఓ తనిఖీ



కోవూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని డీవైఎస్ఓ ఇందిరమ్మ గురువారం తనిఖీ చేశారు. అనంతరం రెయిన్ గేజ్ పనితీరును పరిశీలించారు. రెయిన్ గేజ్ పరిసర ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

బుచ్చిరెడ్డిపాళెం: మండల పరిధిలో దోమల బెడద అధికంగా ఉండడంతో గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎంపీడీఓ శ్రీహరి, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి ప్రతి పంచాయతీకి వెళ్లి దోమల మందును పిచికారీ చేయిస్తున్నారు. కాగా రేబాల గ్రామంలో ఇప్పటికే సేకరించిన ప్లాస్టిక్, సీసాలను నెల్లూరులో విక్రయించేందుకు తరలించామని, ఆ సొమ్మును పంచాయతీ ఖాతాలో జమ వేస్తామని ఈఓపీఆర్డీ గురువారం తెలిపారు.

పంటకోత ప్రయోగాలు కీలకం



మాట్లాడుతున్న ఏఎస్ఓ రామ్మోహన్‌రావు

బుచ్చిరెడ్డిపాళెం : పంటకోత ప్రయోగాల నివేదిక ఆధారంగానే రైతులకు ఫసల్ బీమా యోజన సొమ్ము వస్తుందని ఏఎస్ఓ రామ్మోహన్‌రావు అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల రైతు సేవా కేంద్రంలో ఏఈఓ, వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఓలకు పంటకోత ప్రయోగాలపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి 25 మీటర్ల విస్తీర్ణంలో పంట కోసి దిగుబడి లెక్కించాలన్నారు. ప్రతి గ్రామంలో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో ఈ ప్రక్రియ నిర్వహించాలన్నారు. వచ్చిన ఫలితాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల ఏఓ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పద్య పోటీలు



విద్యార్థినులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్ల ప్రదానం

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీలోని బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో వేమన జయంతి సందర్భంగా గురువారం విద్యార్థులకు పద్య పోటీలు నిర్వహించారు. విజేతలకు వేమన ఫౌండేషన్ అందజేసిన జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎం.సుజాత మాట్లాడుతూ భావితరాలకు వేమన సాహిత్యాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గిడుగు పురస్కార గ్రహీత గండికోట సుధీర్‌కుమార్, తెలుగు ఉపాధ్యాయులు నిరంజన్, లక్ష్మి, రాధిక, రమణమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

తీరప్రాంతంలో జెండా వందనం



విడవలూరు: మండలంలోని తీరప్రాంతమైన ఊటుకూరు పల్లెపాళెంలో పాతపాల దిబ్బ, జీలుగల దిబ్బల వద్ద వివిధ శాఖల అధికారులు జాతీయ జెండాను గురువారం ఎగురవేసి సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ నగేష్‌కుమారి మాట్లాడుతూ త్వరలో జరుగనున్న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇలా చేస్తున్నట్లు తెలిపారు. సీఐ సురేంద్రబాబు, ఎస్సై నరేష్, మెరైన్ సీఐ ప్రసాద్, ఎస్సై నాయబ్ రసూల్, ఎఫ్‌డీఓ సురేష్, ఈఓపీఆర్డీ మస్తాన్, సెక్రటరీ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

వీఎస్‌యూలో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: భూమి లేని రైతు కూలీల సామాజిక ఆర్థిక స్థితిగతులపై మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మాట్లాడుతూ సాంకేతిక మార్పులపై అవగాహన కల్పించడం ద్వారా రైతు కూలీల జీవనోపాధిని మెరుగుపరిచే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, గ్రామీణ, అర్బన్ కూలీల మధ్య నెలకొన్న వ్యత్యాసాల గురించి వివరించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పరశురామయ్య రైతు కూలీల బాధలను వివరించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సదస్సులో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.